

మాగంటి సునీతను శాలువతో సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మాగంటి సునీతకు అభినందనలు

ఎర్రగడ్డ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా అధిష్ఠానం మాగంటి సునీత పేరును ప్రకటించడంతో ఎర్రగడ్డకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు శుక్రవారం కార్యాలయంలో ఆమెను కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎర్రగడ్డకు చెందిన నాయకులు, కార్యకర్తలు అందరం కలిసి సమష్టిగా పనిచేసి మాగంటి సునీతను గెలిపించుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎస్.శిబాస్టియన్, పి.జయంత్, రొంపి శ్రీరామ్, వెంకటేష్ గౌడ్, బి.అంజయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి గుండెకు చేటు: డాక్టర్ శ్రీధర్ కస్తూరి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శారీరక శ్రమ, అసమతుల్య ఆహారం, మానసిక ఒత్తిడి యువతలో గుండె సమస్యలకు కారణమవుతున్నాయని కిమ్-సన్‌షైన్ ఆస్పత్రి కార్డియాలజీ విభాగం అధిపతి కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ శ్రీధర్ కస్తూరి అన్నారు. వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకుని శుక్రవారం కిమ్-సన్‌షైన్ ఆస్పత్రిలో బేగంపేటలో గుండె సంబంధ వ్యాధులు, ఆధునిక శస్త్రచికిత్సలు అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిమ్-సన్‌షైన్ ఆస్పత్రి హార్ట్ ఇనిస్టిట్యూట్ డాక్టర్ల సమక్షంలో కేక్ కట్ చేసి ఈ ఏడాది థీం 'డోంట్ మిస్ ఎ బీట్' అనే అంశంపై ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం 1.7 కోట్లకు పైగా గుండె సంబంధ సమస్యతో మరణిస్తున్నారని అన్నారు. డయాబెటీస్, స్మోకింగ్, రోజు రోజుకు పెరుగుతున్న మైక్రో ప్లాస్టిక్, ట్రాఫిక్ పొల్యూషన్ వంటి వాటికి ఎక్కువగా ఎక్స్‌పోజ్ గుండె సమస్యలకు కారణమవుతోందని డాక్టర్ శ్రీధర్ కస్తూరి తెలిపారు. యోగా, ధ్యానం చేయడం వల్ల గుండెపై ఒత్తిడిని తగ్గించి ఆరోగ్యాన్ని కాపాడవచ్చని తెలిపారు. సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డా॥శైలేందర్‌సింగ్, వైద్యులు విజయకుమార్‌రెడ్డి, సందీప్, శ్రీధర్‌శాస్త్రి, రాజారాం పాల్గొన్నారు.

28న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు

పంజాగుట్ట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజ్యాంగ బద్ధ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని తెలంగాణ రాష్ట్ర డెమోక్రటిక్ ఫోరం(టీఎస్‌డీఎఫ్), జాగో నవ తెలంగాణ చైర్మన్ జస్టిస్ బి.చంద్ర కుమార్ ఆరోపించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 28న ఎన్నికల కమిషన్, న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడాలి అనే అంశంపై నిర్వహిచనున్న సదస్సు పోస్టరును ఆయన టీఎస్‌డీఎఫ్ కన్వీనర్ ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దిడ్డి సుధాకర్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, సొగరా బేగం, తదితరులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సును బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

'69 శాతం రిజర్వేషన్ల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం'

ఖైరతాబాద్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 69 శాతం రిజర్వేషన్ల నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని బీజే రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ అన్నారు. శుక్రవారం ట్యాంక్‌బండ్ జలదృశ్యంలోని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద ఆయన జయంతి ఉత్సవ పోస్టర్‌ను ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ మంత్రిని కలిసి బాపూజీ జయంతికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపూజీ 110వ జయంతి వేడుకలు శనివారం ఉదయం 8 గంటల నుంచి జరుగుతాయని, ఇందలో తెలంగాణ ఉద్యమకారులు, మేధావులు, కళాకారులు, అమరవీరుల కుటుంబసభ్యులు, బాపూజీ అభిమానులు పాల్గొంటారని తెలిపారు.

ఒయాసిస్ ఆయుష్మాన్ స్కాలర్‌షిప్ ప్రోగ్రాం రెండో ఎడిషన్ ప్రకటన

పంజాగుట్ట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఒయాసిస్ ఆయుష్మాన్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని బంజారాహిల్స్‌లోని ఒయాసిస్ ఫర్టిలిటీ సహ వ్యవస్థాపకుడు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ దుర్గా జి రావు, ఎండీ కిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓయాసిస్‌లో, ఇతర అడ్వాన్స్ ఫర్టిలిటీ ట్రీట్‌మెంట్స్ ద్వారా జన్మించిన విద్యార్థులకు మాత్రమే ఈ స్కాలర్‌షిప్ వర్తిస్తుందని, ఈ సంవత్సరం అకాడెమిక్స్, ఆర్ట్, సంస్కృతి, స్పోర్ట్స్, ఇన్నోవేషన్, అసాధారణ విజయాలు సాధించిన పది మంది విద్యార్థులకు ఉపకరవేతనాలు ఇవ్వనున్నట్టు వారు తెలిపారు. వివరాలకు బంజారాహిల్స్ లోని కేంద్రంలో, వెబ్ సైట్ ద్వారా సంప్రదించ వచ్చునని తెలిపారు.

నిమజ్జన టెండర్లపై కాంట్రాక్టర్ల ఆగ్రహం!

ఖైరతాబాద్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దుర్గామాత విగ్రహాల నిమజ్జనాల కోసం జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు టెండర్లలో మార్పులు తేవడంపై కాంట్రాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం రాత్రి ఖైరతాబాద్ మునిసిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఖైరతాబాద్ జోన్ కాంట్రాక్టర్ల సంఘం ఉపాధ్యక్షుడు మహమ్మద్ మసా, కాంట్రాక్టర్లు టెండర్‌లో మార్పులు కేవలం ఇంజనీర్ల అస్మదీయుల కోసమేనని బావిస్తున్నామన్నారు. మొదట క్రేన్ ఆపరేటింగ్‌లో అనుభవం ఉన్న వారు టెండర్లలో పాల్గొన వచ్చని తెలిపి అనంతరం సొంత క్రేన్లు ఉన్నవారే టెండర్లు వేయాలని మార్చారని ఆరోపించారు. క్రేన్ ఆపరేటింగ్‌లో అనుభవం ఉన్న చిన్న కాంట్రాక్టర్లు ఎంతో మంది ఉన్నా, వారిని కాదని క్రేన్ల యజమానులు మాత్రమే టెండర్ వేయాలనడంపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఎల్‌బీ నగర్ ప్రాంతంలో ఇచ్చిన టెండర్లలో అనుభవం ఉన్న కాంట్రాక్టర్లే టెండర్లు వేయాలని పేర్కొన్నారని, అదే విధంగా ఖైరతాబాద్ జోన్‌లో జరిగే నిమజ్జనాల టెండర్లలో మార్పులు తేవాలని కాంట్రాక్టర్లు డిమాండ్ చేశారు.

నేడు బతుకమ్మ కార్నివాల్

- ట్యాంక్‌బండ్‌పై భారీగా ఏర్పాట్లు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ సంబురాల్లో భాగంగా శనివారం ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ కార్నివాల్‌ను హెచ్ఎండీఏ నిర్వహించనుంది. సాయంత్రం 5 గంటల నుంచి అర్ధరాత్రి వరకు జరిగే బతుకమ్మ కార్నివాల్‌కు పెద్దఎత్తున ఏర్పాటు చేస్తోంది. ట్యాంక్‌బండ్‌పై వాహనాల రాకపోకలు నిలిపివేసి తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే వివిధ కార్యక్రమాలను ప్రదర్శించనున్నారు. ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ వంటకాలు, మెహందీ ఆర్ట్, బతుకమ్మ తయారీ వంటి సంప్రదాయ కార్యకలాపాలతో పాటు స్టాళ్లు, స్థానికంగా తయారైన ఉత్పత్తుల విక్రయాలు జరగనున్నాయి. జానపద సంగీతం, సాంప్రదాయ నృత్యాలతో సాంస్కృతిక కార్యక్రమాలు, తెలంగాణ కళాసంపదను ప్రతిబింబించేలా చేపట్టనున్నారు. మహిళలు ప్రత్యేకంగా బతుకమ్మ ఆడేందుకు ఏర్పాట్లు చేశారు. మహిళలు బతుకమ్మలతో ర్యాలీ చేయనున్నారు. కార్నివాల్‌కు వచ్చే సందర్శకులకు ఉచితంగా మొక్కలను పంపిణీ చేయనున్నారు. బతుకమ్మ కార్నివాల్‌లో నగరవాసులు, పర్యాటకులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని హెచ్ఎండీఏ అధికారులు విజ్ఞప్తి చేశారు.



ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ కార్నివాల్‌కు జరుగుతున్న ఏర్పాట్లు

అప్పర్ ట్యాంక్‌బండ్‌పై ట్రాఫిక్ ఆంక్షలు

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే బతుకమ్మ కార్నివాల్ సందర్భంగా శనివారం అప్పర్ ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని జాయింట్ సీపీ జోయల్ డేవిస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఆంక్షలు శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అమలులో ఉంటాయన్నారు. తెలుగుతల్లి జంక్షన్, కర్బలా మైదాన్ వైపు నుంచి వచ్చే వాహనాలను ట్యాంక్‌బండ్‌పైకి అనుమతించరు. ఇక్బాల్ మినార్ వైపు నుంచి వచ్చే వాహనాలను తెలుగుతల్లి ఫ్లైఓవర్, కట్టమైసమ్మ టెంపుల్ వైపునకు పంపుతారు. వీవీ స్టాచ్యూ వైపు నుంచి వచ్చే వాహనాలను నెక్లెస్ రోటరీ, ఐమాక్స్ వైపునకు పంపుతారు. నల్లగుట్ట జంక్షన్ నుంచి వచ్చే వాహనాలను రాణిగంజ్, నెక్లెస్‌రోడ్ వైపునకు పంపుతారు. లిబర్టీ వైపు నుంచి వచ్చే వాహనాలను అంబేడ్కర్ విగ్రహం నుంచి తెలుగుతల్లి ఫ్లైఓవర్ వైపునకు పంపుతారు. సికింద్రాబాద్ వైపునుంచి వచ్చే వాహనాలను కర్బలా మైదాన్, బైబిల్ హౌస్ వైపునకు పంపుతారు. ముషీరాబాద్, కవాడిగూడ వైపు నుంచి వచ్చే వాహనాలను డీబీఆర్ మిల్స్, ధోబీఘాట్‌వైపునకు పంపుతారు. సికింద్రాబాద్ నుంచి ఎంజీబీఎస్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులను స్వీకార్ ఉపకార్, వైఎంసీఏ, సంగీత్, మెట్టుగూడ, తార్నాక, నల్లకుంట, ఫీవర్ ఆస్పత్రి, బర్కత్‌పురా, నింబోలి అడ్డా మీదుగా పంపుతారు. సిటీ బస్సులను కర్బలా మైదాన్, బైబిల్‌హౌస్, కవాడిగూడ క్రాస్‌రోడ్స్ వైపునకు మళ్లిస్తారు. ఆయా రూట్లలో ప్రయాణించే వాహనదారులు ఈ ఆంక్షలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని జాయింట్ సీపీ జోయల్ డేవిస్ సూచించారు.

వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళి

నిమ్స్ , సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వీరనారి చాకలి ఐలమ్మ 130 జయంతిని శుక్రవారం నిమ్స్ ఆస్పత్రిలో ఘనంగా నిర్వహించారు. పాత భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో నిర్వహించిన జయంతి వేడుకలలో నిమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎంపీ రాజయ్య మహిళలను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ అమరేశ్వర్ రావు, డాక్టర్ స్వర్ణలత, పీఆర్వో సత్యగౌడ్, డాక్టర్ రాకేష్, డాక్టర్ మార్త రమేష్, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ శైలజ, పారామెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ దయాకర్, కేజియా రాణి, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.



చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, మాజీ ఎంపీ రాజయ్య



ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాగంటి సునీత గోపీనాథ్, కార్పొరేటర్ దేదీప్య

వెంగళరావునగర్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత ఐలమ్మ అని జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా కృష్ణకాంత్ పార్కు జవహర్‌నగర్‌లోని ఐలమ్మ విగ్రహానికి స్థానిక కార్పొరేటర్ దేదీప్యతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు



బతుకమ్మకు హాజరైన కార్పొరేటర్లకు, మహిళా నేతలకు పెద్దమ్మ తల్లి ఫొటోలిచ్చి సత్కరిస్తున్న విజయారెడ్డి

పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

ఖైరతాబాద్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్ గంగమ్మ దేవాలయం వద్ద బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్పొరేటర్, ఫౌండేషన్ చైర్మన్ విజయారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో సాంస్కృతిక శాఖ చైర్మన్ వెన్నెల, సికింద్రాబాద్ నాయకురాలు కోట నీలిమ, కార్పొరేటర్లు రజితరెడ్డి, సామల హేమ, బొంతు శ్రీదేవి, అత్తిలి అరుణ శ్రీనివాస్, ఉషశ్రీలతో పాటు పలువురు మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులకు విజయారెడ్డి పెద్దమ్మ తల్లి ఫొటోలు బహూకరించి సత్కరించారు.

మధురానగర్‌లో



వెంగళరావు నగర్ డివిజన్ మధురానగర్ సంక్షేమ సమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక శ్రీ సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీ హాలులో జరిగిన వేడుకల్లో బతుకమ్మలతో మహిళలు

- వెంగళరావునగర్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి)



బతుకమ్మ ఫ్లోరల్ ఫెస్టివల్

మాదాపూర్‌లోని స్టేట్ గ్యాలరీలో శుక్రవారం బతుకమ్మ ఫ్లోరల్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మపై నిర్వహించిన స్పాట్ పెయింటింగ్ పోటీల్లో విజేతలకు డాక్టర్ మర్రి చెన్నారెడ్డి హెచ్‌ఆర్డీ డైరెక్టర్ జనరల్ శాంతికుమార్ సర్టిఫికెట్లను అందజేశారు.

- హైటెక్ సిటీ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి)



అమీర్‌పేటలోని హెచ్ఎండీఏ కార్యాలయంలో మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో హెచ్‌జీసీఎల్ సీజీఎం పరంజ్యోతి, ప్లానింగ్ ఆఫీసర్ శాలిని, హెచ్ఎండీఏ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షురాలు ఉమా పాల్గొన్నారు.

- హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి



ఎస్పీఆర్ హిల్స్ క్రీడా ప్రాంగణంలో కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకురాలు కంజర్ల విజయలక్ష్మి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న టీపీసీసీ కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ

- బోరబండ (ఆంధ్రజ్యోతి)



రాజీవ్‌గాంధీ నగర్‌లోని ఆంధ్రజ్యోతి ప్రింటింగ్ ప్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండపంలో కనకదుర్గ అమ్మవారికి నిర్వహించిన పూజల్లో పాల్గొన్న హెచ్‌ఆర్ డిపార్టుమెంట్ మేనేజర్ ఎస్.చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ మేనేజర్ బి.ప్రకాశ్, ఆఫీసర్ డి.లోకేష్, స్టోర్ అసిస్టెంట్ ఆర్.సంబశివరావు

- ఆహ్వానం



సనత్‌నగర్ జెక్ కాలనీలో ఈనెల 29న జరిగే బతుకమ్మ వేడుకలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆహ్వానిస్తున్న బతుకమ్మ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభ, అన్నపూర్ణ కాలనీ అధ్యక్షుడు మల్లు ప్రసాద్

- బేగంపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి)

సీఎం ప్రజావాణికి 102 దరఖాస్తులు

బేగంపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 102 దరఖాస్తులు వచ్చాయి. భారీ వర్షం కురుస్తున్నప్పటికీ ప్రజాభవన్‌కు వచ్చి ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. వర్షంలో ప్రజలు ఇబ్బంది పడకుండా వారిని ప్రజాభవన్ మెయిన్ గేట్ నుంచి సీఎం ప్రజావాణి వరకు బ్యాటరీ వాహనాల ద్వారా సిబ్బంది తరలించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 34, రెవెన్యూకు 21, ఇందిరమ్మ ఇండ్ల కోసం 26, ప్రవాసీ ప్రజావాణికి 1, ఇతర శాఖలకు సంబంధించిన 20 దరఖాస్తులు వచ్చినట్లు అధికారి తెలిపారు. సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి ప్రజల దరఖాస్తులను తీసుకోవడంతో పాటు ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

అంబేడ్కర్ వర్సిటీ యూజీ, పీజీ అడ్మిషన్ల గడువు పొడిగింపు

- ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు ఆఖరు తేదీ అక్టోబరు 10

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు గడువును అక్టోబరు 10 వరకు పొడిగిస్తూ వర్సిటీ అధికారులు ప్రకటన విడుదల చేశారు. 2025-26 విద్యా సంవత్సరంలో బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సులతో పాటు, ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంబీఏ పీజీ కోర్సులతోపాటు డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు గడువును అక్టోబరు 10 వరకు పొడిగించారు. అభ్యర్థుల రిజిస్ట్రేషన్, ట్యూషన్ ఫీజుల చెల్లింపునకు అక్టోబరు 10 చివరి తేదీ అని ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం వర్సిటీ హెల్ప్‌డెస్క్ 040-23680333/444/555 నెంబర్లపై సంప్రదించాలని. పూర్తి వివరాల కోసం వర్సిటీ వెబ్‌సైట్‌ను చూడాలని పేర్కొన్నారు.

అక్టోబరు 1న టీపీజీఎల్ వేలం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): శ్రీనిధి యూనివర్సిటీ తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ (టీపీజీఎల్) క్రీడాకారుల వేలాన్ని వచ్చే నెల 1న నిర్వహించనున్నారు. శుక్రవారం నగరంలోని ఒక హోటల్‌లో జరిగిన టీపీజీఎల్ జట్ల యజమానుల సమావేశంలో ఈ సీజన్ లీగ్ ప్రణాళికను ఖరారు చేశారు. వచ్చే నెల 1వ తేదీన ప్లేయర్ల వేలం, 12న లీగ్ షెడ్యూల్ అధికారిక ప్రకటన, 25వ తేదీ నుంచి లీగ్ మ్యాచ్‌లు, నవంబరు 23న ఫైనల్‌ను నిర్వహించనున్నారు. ఈ లీగ్‌లో మొత్తం 16 జట్లు తలపడనున్నాయని లీగ్ కమిషనర్ సంజయ్ చెప్పారు.

5వ అంతస్తుపై నుంచి పడి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి

బోరబండ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అపార్ట్మెంట్‌లోని 5వ అంతస్తు పై నుంచి కిందపడి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతిచెందిన సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కల్యాణ్‌నగర్ వెంచర్-3లో శుక్రవారం జరిగింది. కుటుంబసభ్యులు, బోరబండ ఎస్ఐ. వీహెచ్ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. కల్యాణ్‌నగర్ వెంచర్-3లోని జయప్రియ అపార్ట్మెంట్‌లోని 302 ఫ్లాట్‌లో నివసించే బొల్లాప్రగడ ఎం.వి.శివకుమార్(40) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్టు కుటుంబ సభ్యులు, సన్నిహితులకు సమాచారం అందించాడు. శుక్రవారం తెల్లవారుజామున 3గంటల సమయంలో శివకుమార్ అపార్ట్‌మెంట్ 5వ అంతస్తుకు వెళ్లాడు. కొన్ని గంటల తర్వాత తీవ్రగాయాలతో శివకుమార్ అపార్ట్‌మెంట్ కింద పండి మరణించి ఉన్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. బోరబండ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

కనుల పండువగా శరన్నవరాత్రి వేడుకలు



బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో శ్రీ గజలక్ష్మీ దేవిగా అలంకృతురాలైన అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ కార్పొరేటర్ శేషుకుమారి

బంజారాహిల్స్/అమీర్‌పేట/బోరబండ/బేగంపేట/యూసుఫ్‌గూడ/ సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేవీశరన్నవరాత్రి వేడుకలు ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో కనుల పండువగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారి ఆలయాలు, మండపాలు భక్తులతో కిటకిటలాడాయి. జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి గజలక్ష్మీ దేవిగా ఆలంకరణ చేశారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద యెత్తున భక్తులు రావడంతో ఆలయం జనసంద్రంగా మారింది. క్యూలో నిలబడ్డ భక్తులకు దర్శనానికి గంటకు పైగా సమయం పట్టింది. శ్రీనగర్‌కాలనీ భ్రమాంభమల్లికార్జున దేవాలయం, అమీర్‌పేట దనలక్ష్మి(సోనాబాయి) దేవాలయంలో అమ్మవారికి మహాలక్ష్మీ దేవిగా అలంకరణ గావించారు. దేవీనవరాత్రుల్లో భాగంగా జూబ్లీహిల్స్ ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ కల్చరల్ సెంటర్‌లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో సూర్యగాయత్రి ఆలపించిన ఆధ్యాత్మిక గీతాలు ఆకట్టుకున్నాయి.



గజలక్ష్మీ దేవి అలంకరణలో జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి



బోరబండ బస్టాపు వద్దనున్న దుర్గాదేవి మండపంలో వెంగళరావు నగర్ కార్పొరేటర్ దేదీప్య రావుతో కలిసి పూజకు హాజరైన జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్



ఎల్లారెడ్డిగూడ విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి మహాలక్ష్మిగా అలంకరణ చేసి మూడు లక్షల రూపాయల కరెన్సీతో అలంకరణ చేసి పూజాధికాలు నిర్వహించారు



ఎల్లారెడ్డిగూడ అమ్మవారి ఆలయంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు నవీన్‌యాదవ్, స్థానికులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బౌద్ధనగర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కేబుల్, తదితర మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరాను నిలిపి వేస్తున్నామని విద్యానగర్‌శాఖ ఏఈ రోచిత తెలిపారు. జామై ఉస్మానియా ఫీడర్ పరిధిలో జామైఉస్మానియా, అంబర్‌నగర్, లలితానగర్, పార్ట్ ఆఫ్ అడిక్‌మెట్ ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

ఆడబిడ్డలకు కాంగ్రెస్ అండ: ఎమ్మెల్యే శ్రీగణేష్

మారేడుపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డల వివాహాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మారేడుపల్లి మండలానికి చెందిన 9 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆడబిడ్డల వివాహాలకు అప్పులు చేయొద్దనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద రూ.లక్ష అందజేస్తుందని తెలిపారు. కల్యాణలక్ష్మి చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మహిళలకు సూచించారు.


రక్తదానం చేసిన అధికారులతో రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ తదితరులు

రక్తదానం.. ప్రాణదానం

● రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అన్నారు. రైల్వే రక్షణ దళం(ఆర్పీఎఫ్) వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 35 మంది ఆర్పీఎఫ్ పోలీస్ అధికారులు రక్తదానం చేశారు. వారిని రైల్వే జీఎం అభినందించారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ కమ్, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ ఆరోమా సింగ్ ఠాగూర్, రైల్వే చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ జెడ్‌ఖాన్, సికింద్రాబాద్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ నవీన్‌కుమార్, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ సతీష్ ప్రభు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకల్లో కార్పొరేటర్ హేమ



సీతాఫల్‌మండి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సామల హేమ పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి పాడారు.
- బౌద్ధనగర్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి)

18 కిలోల గంజాయి పట్టివేత

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో భారీగా గంజాయి పట్టుబడింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఓ వ్యక్తి వద్ద 18కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ జావెద్, సీఐ సాయిఈశ్వర్‌గౌడ్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన రవి హిరలాల్(32) ప్రైవేట్ ఉద్యోగి. సులువుగా డబ్బు సంపాదించేందుకు గంజాయి సరఫరా మార్గాన్ని ఎంచుకున్నాడు. బెర్హంపూర్ అటవీ ప్రాంతంలోని ఒక వ్యక్తి నుంచి 18 కిలోల గంజాయి సరుకు సేకరించి ట్రాలీ సూట్‌కేస్‌లో జాల్నా పట్టణంలో విక్రయించేందుకు బెర్హంపూర్ రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కి శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో దిగాడు. సికింద్రాబాద్ నుంచి దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలులో వెళ్లేందుకు టికెట్ కొనుగోలు చేసి రైలు ఎక్కాడు. అతనిపై అనుమానం వచ్చిన రైల్వే పోలీసులు, ఆర్పీఎఫ్ పోలీసులు అతణ్ణి తనిఖీ చేశారు. రూ.9.13లక్షల విలువ చేసే 18కిలోల గంజాయి పట్టుబడింది. గంజాయి సరుకును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

జేబీఎస్‌లో బంగారు ఆభరణాలు చోరీ

మారేడుపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండులో ఇద్దరు మహిళల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. మారేడుపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆర్మూర్‌కు చెందిన మమత ఈ నెల 16న హైద్రాబాద్‌లో ఉన్న తన పుట్టింటికి భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి వచ్చింది. 19న తిరిగి అర్మూర్‌కు వెళ్లడానికి జేబీఎస్‌కు వచ్చింది. ఆర్మూర్ వెళ్లాక తన బ్యాగులో ఉన్న ఆరు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. వెంటనే ఆమె ఆర్మూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలించగా జేబీఎస్‌లో మమత వెనుక సీట్లో ఉన్న వ్యక్తి బంగారు ఆభరణాలు కలిగిన బాక్సును తీసుకుని బస్టాండులో దిగిపోయినట్లు సీసీ ఫుటేజీలో కనిపించింది. వెంటనే ఆర్మూర్ పోలీసులు కేసును మారేడుపల్లి పోలీసులకు బదిలీ చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అదే విధంగా జగద్గిరిగుట్టకు చెందిన విజయ ఈ నెల 25న తన కొడుకుతో కలిసి పెద్దపల్లికి వెళ్లేందుకు జేబీఎస్ వచ్చింది. టికెట్ తీసుకోవడానికి హ్యాండ్‌బ్యాగ్‌లో ఉన్న ఆధార్ కార్డు తీసేలోపు బ్యాగ్ తెరిచి ఉండడం గమనించింది. బ్యాగులో ఉన్న మూడు తులాల బంగారు ఆభరణాలు పోయినట్లు గుర్తించి వెంటనే మారేడుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


మాట్లాడుతున్న కార్డియోథొరాసిక్ సర్జన్ డా.శ్రీధర్ కస్తూరి

ఒత్తిడి గుండెకు చేటు: డాక్టర్ శ్రీధర్ కస్తూరి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శారీరక శ్రమ, అసమతుల్య ఆహారం, మానసిక ఒత్తిడి యువతలో గుండె సమస్యలకు కారణమవుతున్నాయని కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రి కార్డియాలజీ విభాగం అధిపతి కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ శ్రీధర్ కస్తూరి అన్నారు. వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకుని శుక్రవారం కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రిలో బేగంపేటలో గుండె సంబంధ వ్యాధులు, ఆధునిక శస్త్రచికిత్సలు అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రి హార్ట్ ఇనిస్టిట్యూట్ డాక్టర్ల సమక్షంలో కేక్ కట్ చేసి ఈ ఏడాది థీం 'డోంట్ మిస్ ఎ బీట్' అనే అంశంపై ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం 1.7 కోట్లకు పైగా గుండె సంబంధ సమస్యతో మరణిస్తున్నారని అన్నారు. డయాబెటీస్, స్మోకింగ్, రోజు రోజుకు పెరుగుతున్న మైక్రో ప్లాస్టిక్, ట్రాఫిక్ పొల్యూషన్ వంటి వాటికి ఎక్కువగా ఎక్స్‌పోజ్ గుండె సమస్యలకు కారణమవుతోందని డాక్టర్ శ్రీధర్ కస్తూరి తెలిపారు. యోగా, ధ్యానం చేయడం వల్ల గుండెపై ఒత్తిడిని తగ్గించి ఆరోగ్యాన్ని కాపాడవచ్చని తెలిపారు. సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డా.శైలేందర్‌సింగ్, వైద్యులు విజయకుమార్‌రెడ్డి, సందీప్, శ్రీధర్‌శాస్త్రి, రాజారాం పాల్గొన్నారు.


నల్లపోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్, జంపన ప్రతాప్, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు


హస్మత్‌పేట్‌లో అమ్మవారిని దర్శించుకున్న కాంగ్రెస్ నాయకులు కోట నీలిమ, యాదగిరి


మహాలక్ష్మీదేవీ అలంకరణలో కనకదుర్గ అమ్మవారు


సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో కరెన్సీ నోట్ల అలంకరణలో అమ్మవారు

అంతటా అమ్మ నామమే..

● కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రి వేడుకలు

సికింద్రాబాద్/ బౌద్ధనగర్/ తిరుమలగిరి/ అడ్డగుట్ట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రి వేడుకలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. ప్రతి రోజు భిన్న అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారు. కాలనీలు, బస్తీలు, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరుతున్నారు. దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకుంటున్నాయి. పలు ఆలయాల్లో కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. బౌద్ధనగర్ కనకదుర్గ ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవీ అలంకరణలో, మేడిబావి పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారు కంచికామాక్షీదేవీ అలంకరణలో, బొల్లారం డౌటన్ బజార్‌లో అమ్మవారు లలిత త్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బోయినపల్లి బాపూజీ నగర్‌లోని నల్ల పోచమ్మ ఆలయంలోని అమ్మవారిని ఆలయ చైర్మన్ జంపన ప్రతాప్‌తో కలిసి ఎమ్మెల్యే శ్రీగణేష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయ ఈఓ గుత్తా మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు దండుగుల యాదగిరి, కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ, బీజేపీ నేతలు శ్యాంసుందర్‌గౌడ్, మేకల సారంగపాణి, నాయకులు వెంకటేశ్వరరావు, శ్రీను, సంగీత్. బోయినపల్లి మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ పాలకమండలి సభ్యుడు శరత్ తదితరులు పాల్గొన్నారు.


మేడిబావి ముత్యాలమ్మ పోచమ్మ ఆలయంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ చైర్మన్ కళాప్రకాశ్


తిరుమలగిరి : హోమంలో పాల్గొన్న రాజారెడ్డి దంపతులు


తుకారాంగేట్ చౌరస్తాలోని అమ్మవారి పూజలో పాల్గొన్న గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య, తుకారాంగేట్ సీఐ శ్రీకాంత్‌రెడ్డి


బొల్లారం సదర్ బజార్‌లోని మహాకాళి ఆలయంలో నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

పింఛన్లు పెంచడం చేతకాకపోతే రాజీనామా చెయ్

● సీఎంపై మందకృష్ణమాదిగ ధ్వజం

బౌద్ధనగర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్లు పెంచడం చేతకాకపోతే రేవంత్‌రెడ్డి సీఎం పదవికి రాజీనామా చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ నామాలగుండు టీఎన్ఆర్‌గార్డెన్‌లో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి, చేయూత పెన్షన్‌దారుల ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు నాలుగువేల రూపాయలు, దివ్యాంగులకు ఆరు వేల రూపాయలు పెన్షన్ ఇస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2023 ఎన్నికల సమయంలో బహిరంగంగా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలవుతున్నా పెన్షన్లు పెంచకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. అదే విధంగా కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్లు పెంచకపోతే నవంబరులో చలో హైదరాబాద్ పేరున పరేడ్ గ్రౌండ్‌లో లక్షలాదిమందితో మహాగర్జనను నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో వీహెచ్‌పీఎస్ హైదరాబాద్ ఇన్‌చార్జి రాంబాబు, వీహెచ్‌పీఎస్ నాయకులు దయమణి, కళాజ్యోతి, వాణి, సంతోషి, సరిత, అనిత, సీహెచ్‌పీఎస్ నాగమణి, ఎమ్మార్పీఎస్ సికింద్రాబాద్ ఇన్‌చార్జి డప్పు మల్లికార్జున్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మందకృష్ణమాదిగ

పోగొట్టుకున్న ఫోన్ల అందజేత

రెజిమెంటల్‌బజార్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీఈఐఆర్ టెక్నాలజీతో పోగొట్టుకున్న ఫోన్లను తిరిగి పొందవచ్చని మార్కెట్ సీఐ రామచందర్ తెలిపారు. మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొబైల్స్ పోగొట్టుకున్న బాధితులకు సీఈఐఆర్ పోర్టల్ సాయంతో ఫోన్లను గుర్తించి శుక్రవారం అందజేశారు. డీఐ బషీర్ అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

రజక సంఘం భవనం ప్రారంభం

బోయినపల్లి: బోయినపల్లిలోని తోకట్ట దోబీ ఘూట్‌లో తన సొంత నిధులతో నిర్మించిన రజక సంఘం భవనాన్ని శుక్రవారం కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని రజక సంఘాన్ని ప్రారంభించినట్లు మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు పాండు యాదవ్, శ్యామ్‌కుమార్, అనిత, నళినికిరణ్, రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పాత నోట్లు, నాణేల పేరుతో బురిడీ

● రూ.3.61 లక్షలు పోగొట్టుకున్న వ్యక్తి

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి): పాత కరెన్సీ నోట్లు, నాణేల పేరిట ఒక వ్యక్తికి సైబర్ కేటుగాళ్లు బురిడీ వేశారు. బాధితుడు లక్షల్లో నగదు పోగొట్టుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. పాత నాణేలకు లక్షల్లో డబ్బు ఇస్తామని సోషల్ మీడియాలో ప్రకటనను చూసి బోయినపల్లికి చెందిన వ్యక్తి (57) సంప్రదించాడు. ఇండియన్ కాయిన్ కంపెనీ ప్రతినిధులమని సైబర్ నేరగాళ్లు పరిచయం చేసుకున్నారు. వ్యక్తి వద్ద ఉన్న పాత నోట్లు, కాయిన్లను ఫొటోలు తీసుకున్నారు. ఈ నాణేలు, కరెన్సీకి రూ. 95 లక్షలు ఇస్తామని నమ్మించారు. వ్యక్తికి చెందిన ఆధార్ వివరాలు సేకరించారు. తర్వాత పలు దఫాలుగా రూ.3.61 లక్షలు వసూలు చేశారు. ఇంకా డబ్బులు డిమాండ్ చేయడంతో మోసపోయాయని గ్రహించాడు. వెంటనే సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎన్ఐఈపీఐడీ డైరెక్టర్ రాంకుమార్

బోయినపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలని ఎన్ఐఈపీఐడీ డైరెక్టర్ రాంకుమార్ పిలుపునిచ్చారు. వికలాంగుల హక్కుల వేదిక 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం ఎన్ఐఈపీఐడీ ఆడిటోరియంలో శుక్రవారం ఎబిలిటీ ఫెస్ట్ 2025 కార్యక్రమాన్ని జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాంకుమార్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఎంతోమంది దివ్యాంగులు ఉన్నత స్థాయికి చేరారని, వారిని ఆదర్శంగా తీసుకుని మిగతా దివ్యాంగులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తమ హక్కుల కోసం, ఆత్మ గౌరవం కోసం సంఘాలు ఏర్పాటు చేసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆలింకో స్వచ్ఛంద సంస్థ ద్వారా పలువురు సహాయ పరికరాలను పంపిణీ చేశారు. ముందుగా కూకట్‌పల్లికి చెందిన రాందేవ్ ఆసుపత్రి వారు మెడికల్ క్యాంపు నిర్వహించి పలువురు దివ్యాంగులకు ఉచితంగా మందులు పంపిణీచేశారు. అల్లింకో స్వచ్ఛంద సంస్థ సభ్యుడు సంజయ్, శివకుమార్ అగర్వాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఫలక్‌నుమా'లో ఉగ్రమూకలంటూ ఫోన్‌కాల్

● ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్‌లో రైలు నిలిపివేత

● అన్ని బోగీల్లో ముమ్మర తనిఖీలు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్ రాష్ట్రం హౌరా నుంచి సికింద్రాబాద్‌కు వస్తున్న ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో ఉగ్రవాదులున్నారనే ఫోన్‌కాల్ ఆధారంగా రైల్వే పోలీసులు ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్‌లో రైలును నిలిపి తనిఖీలు చేపట్టారు. శుక్రవారం ఉదయం 9.55 గంటలకు ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్‌కు రైలు చేరుకోగానే రైలును అక్కడ నిలిపి అన్ని బోగీల్లో తనిఖీలు చేపట్టారు. 23 బోగీల్లో ప్రయాణిస్తున్న దాదాపు రెండు వేల మంది ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. బయట ఏమి జరిగిందో పోలీసులు ఎందుకు తనిఖీ చేస్తున్నారో తెలియక ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. చర్లపల్లి ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్ మీనన్ ఆధ్వర్యంలో స్థానిక, రైల్వే పోలీసులు, డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌లతో ప్రయాణికులు, వారి లగేజీలను చెక్ చేశారు. బంగ్లాదేశ్ నుంచి కరుడుగట్టిన ఉగ్రవాదులు మరణాయుధాలతో ప్రయాణిస్తున్నారని రైల్వే పోలీసులకు అందిన సమాచారంతో అప్రమత్తమై ముమ్మరంగా తనిఖీలు చేపట్టినట్టు వారు తెలిపారు. గంటపాటు తనిఖీలు నిర్వహించాక రైతులో ఉగ్రమూకలు ఎవరూ లేరని నిర్ధారించుకొని రైలును సికింద్రాబాద్‌కు పంపించారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. మల్కాజ్‌గిరి అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఎస్‌వోటీ, ఇంటలిజెన్స్ అధికారులతో పాటు స్థానిక సీఐ బాలస్వామి, క్రైం సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.


డ్వాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న రైల్వే పోలీసులు

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

● ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

సికింద్రాబాద్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమని సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. సికింద్రాబాద్ సిక్ విలేజీలోని దోబీఘాట్‌లో శుక్రవారం చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ సీఈఓ మధుకర్‌నాయక్, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్, కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్‌తో కలిసి ఎమ్మెల్యే ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ ప్రదర్శించిన తెగువను కొనియాడారు. కార్యక్రమంలో జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ సభ్యులు పాండుయాదవ్, నళినికిరణ్, అనితాప్రభాకర్, శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.


ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

బౌద్ధనగర్‌లో..

బౌద్ధనగర్: మహిళలు చాకలి ఐలమ్మ ధైర్యాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్ అన్నారు. వారాసిగూడ పుల్లయ్యబావిలో స్థానిక రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్ర పటానికి మాజీ కార్పొరేటర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్‌గౌడ్, రజక సంఘం సభ్యులు బాలయ్య, నారాయణ, కిషన్ కృష్ణ పాల్గొన్నారు.

ఆర్మీ సుబేదార్ మృతి

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణిస్తున్న ఆర్మీ సుబేదార్ మృతి చెందాడు. ఈ సంఘటన సికింద్రాబాద్‌లో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. నాగాలాండ్‌లోని దినాపూర్‌లో ఆర్మీ సుబేదార్‌గా పని చేస్తున్న దినేష్ కుమార్ గుప్త కొద్ది రోజుల క్రితం సెలవుపై ఉప్పల్‌లో ఉంటున్న భార్యా పిల్లల వద్దకు వచ్చాడు. తిరుపతి దైవ దర్శనం చేసుకుని గురువారం రాత్రి తిరుగుపయనమయ్యారు. శుక్రవారం ఉదయం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు రైలు చేరుకోవడంతో భర్తను భార్య నిద్రలేపింది. ఎటువంటి స్పందన లేకపోవడంతో వెంటనే ఆమె రైల్వే పోలీసులకు సమాచారమందించింది. పోలీసులు సికింద్రాబాద్‌లోని మెడికవర్ ఆస్పత్రికి తరించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌పై దౌర్జన్యం.. ముగ్గురి రిమాండ్

రెజిమెంటల్‌బజార్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వాహనం తొలిగించాలని చెప్పిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌పై దౌర్జన్యానికి దిగిన ముగ్గురు వ్యక్తులను మార్కెట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆర్పీ రోడ్డులో ఓ షాపింగ్ మాల్ రెన్నోవేషన్ పనులు జరుగుతున్నాయి. బుధవారం సాయంత్రం సామగ్రి తీసుకువచ్చిన వాహనం రోడ్డుపై నిలపడం వలన ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. మహాకాళి ట్రాఫిక్ సీఐ రఘునాథ్ వాహనం తొలిగించాలని ఆదేశించారు. మహారాష్ట్రకు చెందిన షబ్బీర్ హుస్సేన్, షాయివాల, కర్ణాటకకు చెందిన షహబుద్దీన్‌లు ట్రాఫిక్ సీఐతో గొడవకు దిగడంతో పాటు సీఐని తోశేశారు. విధులకు ఆటంకం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఐ మార్కెట్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

ఢిల్లీ నుంచి నగరానికి అక్రమంగా విదేశీ మద్యం

● 44 బాటిళ్లు స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీ నుంచి హైదరాబాద్ నగరానికి అక్రమంగా దేశీయ మద్యంతో పాటు.. విదేశీ మద్యాన్ని సరఫరా చేసి గుట్టుగా విక్రయిస్తున్న ముగ్గురిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 44 బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా ప్రకాశంబజారుకు చెందిన ముగ్గురు వ్యక్తులు ఏలూరు రవి, వాడ్గర్ శ్రీధర్, వెంకటేశ్వరరావులు ముఠాగా ఏర్పడ్డారు. ఢిల్లీలో మద్యాన్ని కొనుగోలు చేసి రైలులో గుట్టుగా హైదరాబాద్‌కు రవాణా చేస్తారు. నగరంలో విక్రయించి వచ్చిన సొమ్మును సమానంగా పంచుకుంటారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు సీఐ సౌజన్య బృందం శుక్రవారం రైల్వేస్టేషన్ సమీపంలో మాటువేసి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మొదట వారి వద్ద 20 మద్యం బాటిళ్లు సీజ్ చేశారు. అనంతరం వారిని విచారించి సుల్తాన్ బజార్‌లో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన మరో 24 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 44 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను నారాయణగూడ ఎక్సైజ్ పీఎస్‌లో అప్పగించారు.

చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో 'స్వచ్ఛతా హి సేవా'

కుషాయిగూడ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్లలో ఆహార భద్రత, ఫుడ్ స్టాల్స్‌ను పరిశుభ్రంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వ్యాపారులకు తెలియజేసేందుకు దక్షిణమధ్య రైల్వే శాఖ ఆధ్వర్యంలో 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో దక్షిణ మధ్య రైల్వేశాఖ పీసీఎండీ డాక్టర్ నిర్మల రాజారామ్ అధ్యక్షతన అవగాహన సదస్సును నిర్వహించారు. స్టేషన్‌లోని ఫుడ్ స్టాల్స్‌ను తనిఖీ చేయడంతో పాటు పలువురు ప్రయాణికులతో మాట్లాడి ఆహార పదార్థాల నాణ్యత, శుభ్రతపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం నిర్మలతో పాటు సికింద్రాబాద్ డివిజన్ సీఎంఎస్ డాక్టర్ కె.నారాయణ స్వామి, సికింద్రాబాద్ ఏహెచ్‌ఓ హరికృష్ణ, సికింద్రాబాద్, నాందేడ్, హైదరాబాద్ డివిజన్ ఎఫ్ఎస్ఓ జి.వెంకట హనుమంతరావు ఆహార భద్రత, ఫుడ్ స్టాల్స్‌ను పరిశుభ్రంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వ్యాపారస్థులకు వివరించారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ, పర్సనల్ హైజీన్, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు సోమరాజు (సికింద్రాబాద్), దీపు కుమార్(చర్లపల్లి) పాల్గొన్నారు.


ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఎస్ఓ హనుమంతరావు